

బిజెపి మతతత్వ విధానాలకు చెంప పెట్టు

- కర్ణాటక ఎన్నికల ఫలితాలపై సిపిఎం

ప్రజాశక్తి - కాకినాడ

కర్ణాటక రాష్ట్ర ఎన్నికల ఫలితాలు, బిజెపి విభజన రాజకీయాలుకు, మతతత్వ, రాజ్యాంగ స్ఫూర్తికి భంగం కలిగించే విధానాలకు చెంప పెట్టు ఫలితం అని, కర్ణాటక ప్రజలు దేశానికి ఇచ్చిన మార్గ దర్శకమని సిపిఎం జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జిల్లా కన్వీనర్ ఎం. రాజశేఖర్ శనివారం ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే విధంగా బిజెపి ఫెడరల్ స్ఫూర్తిని దెబ్బ తీస్తున్న, ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీలు టిడిపి, వైసిపి, జనసేన బిజెపికి సాగిలపడుతున్నాయి తప్ప రాష్టానికి జరిగిన అన్యాయం, ప్రత్యేక హెూదా విభజన హామీలు అమలు కోసం కనీసం మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. ఆ పార్టీలు తలొగ్గడం మాని బిజెపికి వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం కోరుతోందని రాజశేఖర్ తెలిపారు.

రసాయన పండు.. రోగాలు మెండు

- కాల్షియం కార్బయిడ్‌తో విచ్చలవిడిగా మాగేస్తున్న వ్యాపారులు
- నిబంధనలకు విరుద్ధంగా పళ్ల వ్యాపారాలు
- పర్యవేక్షణ మరిచిన అధికారులు

కాకినాడ మార్కెట్లో మామిడి పళ్లు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

మార్కెట్‌లో మామిడి పళ్లు నిగనిగలాడుతున్నాయి. ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. దోరగా కంటికి ఇంపుగా ఉన్నాయని మామిడి పళ్లను కొని తింటే అనారోగ్యానికి గురికాక తప్పదంటున్నారు వైద్యులు. మధుర ఫలంగా పేరొందిన మామిడి పళ్లను కాల్షియం కార్బయిడ్‌తో మాగ పెడుతుండడంతో కొనే వారు అనారోగ్యాల బారిన పడుతున్నారు. లాభాపేక్షే ధ్యేయంగా కొందరు పళ్ల వ్యాపారం సాగిస్తూ పలువురి ప్రాణాలతో చెలగాట మాడుతున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కార్బయిడ్ రసాయనంతో పండించిన పళ్లను తినడం వలన పలు వ్యాధులకు గురవుతున్న నేపథ్యంలో 2012 లోనే ఉమ్మడి రాష్ట్రాల హైకోర్టు ఈ పళ్ల అమ్మకాలను నిషేధించింది. అయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల యథేచ్ఛగా వ్యాపారాలు సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

కాకినాడ జిల్లాలో తుని, తొండంగి, జగ్గంపేట, పెద్దాపురం, పిఠాపురం, శంఖవరం, ప్రత్తిపాడు తదితర మెట్ట మండలాల్లో సుమారు 1.25 లక్షల ఎకరాల్లో మామిడి తోటలు సాగవుతున్నాయి. ఏటా దాదాపు 70 వేల మెట్రిక్ టన్నుల పళ్లు దిగుబడి వస్తున్నట్లు రైతులు తెలిపారు. బంగినపల్లి, రసాలు, కొబ్బరి మామిడి, సువర్ణరేఖ, ఆల్ఫోన్సా, గోవా, కీసర, వంటి వందకుపైగా రకాలు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. వేసవిలో మాత్రమే లభించే మామిడి పళ్లను చాలా మంది ఇష్టంగా తింటారు. పిండి పదార్థాలు, చక్కెరలు, పీచు పదార్థాలు, వివిధ విటమిన్లు, క్యాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, మెగ్నీ షియం, పొటాషియం, జింకు వంటి ఖనిజ లవణాలు వాటిలో పుష్కలంగా లభిస్తాయని వైద్యులు తెలిపారు.

మధురమైన విషం.!

మధురమైన ఈ పళ్లు విషపూరితంగా మారిపోయాయని వైద్యులు ఎప్పటి కప్పుడు హెచ్చరిస్తున్నారు. మామిడి కాయ చెట్ల పైన పక్వానికి రాకముందే కోసి కృత్రిమంగా కాల్షియం కార్బయిడ్‌తో మగ్గ పెడుతూ 18 గంటల నుంచి 24 గంటల్లో కాయను పండుగా మార్చేసి కొంతమంది వ్యాపారులు అడ్డదారి తొక్కుతున్నారు. కార్బైడ్‌తో నిగనిగ లాడుతూ కంటికి చక్కగా కనిపించే వీటిని తింటే రోగాలను కొని తెచ్చు కోవాల్సిందేనంటూ డాక్టర్లు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధాన కేంద్రా లుగా ఉన్న కాకినాడ, రాజమహేంద్రవరం, అమలాపురంతో పాటు వివిధ ప్రాంతాల్లోని మార్కెట్లో మిలమిల మెరుస్తున్న మామిడి పండ్లు ఇప్పుడు దర్శనమిస్తున్నాయి. కొందరు వ్యాపారులు వీటిని కృత్రిమంగా కాల్షియం కార్బయిడ్‌తో మగ్గ పెడుతూ జిల్లాలో పలు మండలాలకు సరఫరా చేస్తున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

మామిడి తోటల నుండి వ్యాపారులు గుత్తగా మామిడికాయలను తీసుకువచ్చి నిషేధిత కార్బన్ రసాయలను వాడుతూ పండ్లను మగ్గ పెడుతున్నారు మార్కెట్లోకి రసాయనాలతో మగ్గపెట్టిన పండ్లు విచ్చలవిడిగా వస్తున్నా ఆహార భద్రతాధికారుల పర్యవేక్షణ మాత్రం కొరవడింది. అధికారులు వీటిని ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల్సి ఉన్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నిషేధిత రసాయనాలు సరఫరా జరుగుతున్నా రైతుల్లో వాటిపై అవగాహన కల్పించడం లేదు. కాల్షియం కార్బయిడ్‌కు బదులు ఇథలిన్ గ్యాస్ ద్వారా మగ్గ పెడితే ఆరోగ్యపరంగా సమస్యలు తలెత్తవని కేంద్ర ప్రభుత్వం గతంలోనే ప్రకటించింది. దీనిపై రైతులకు సంబంధిత అధికారులు అవగాహన కల్పించాల్సి ఉంది.

దీర్ఘ కాలిక వ్యాధులు వస్తాయి

కార్బైడ్ రసాయనాలతో మాగపెట్టిన మామిడి పండ్లను తినడం వలన దీర్ఘకాలిక రోగాలు వ్యాప్తి చెందుతాయి. రసాయనాల ద్వారా పండించిన మామిడి పళ్లను తీసుకు న్నవారికి గ్యాస్ట్రిక్ సమస్య, విరేచ నాలు, వాంతులు మొదలయి చివరకు మనిషి పూర్తిగా నీరసించి పోతాడు. ప్రజలు ఎవరి ఆరోగ్యం వారే కాపాడుకోవాలి.

డాక్టర్ డి.హేమలతా దేవి, సూపరింటెండెంట్, జిజిహెచ్, కాకినాడ

విధుల్లోకి తీసుకోవాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన దీక్ష

600 రోజులుగా నిరసన

- విధుల్లోకి తీసుకోవాలని జిజిహెచ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఆందోళన
- హైకోర్టు ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్

ప్రజాశక్తి - కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో తొలగించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది ఆందోళన శనివారం నాటికి 600 రోజులకు చేరుకుంది. 2021 సెప్టెంబరులో 65 మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ సిబ్బందిని, 2022 జూన్‌లో 89 వికాస ఔట్ సోర్సింగ్ సిబ్బందిని జిల్లా అధికారుల ఆదేశాల మేరకు విధుల నుంచి ఆసుపత్రి యాజమాన్యం తొలగించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి తమకు న్యాయం చేయాల్సిందిగా హైకోర్ట్ ఆదేశాలను అమలు చేయాలంటూ ఆసుపత్రి ఎదుటే నిరసన దీక్షలు ప్రారంభించి గత 600 రోజులుగా నిరసన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు మాట్లా డుతూ కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో అడ్డగోలుగా తొలగింపులు జరుగుతు న్నాయని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులను కూడా జిజిహెచ్ అధికారులు లెక్కచేయడం లేదన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతా ధికారులు కూడా జిజిహెచ్లో జరుగుతున్న అక్రమ తొలగింపులపై స్పందించాలన్నారు. ఈ విషయంపై జిల్లాలో ఉన్న ఎంపిలు, ఎంఎల్ఎలు స్పందించి జిజిహెచ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవడానికి సహకరించాలని కోరుతున్నామన్నారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సంఘ నాయకులు ఇంద్రాణి, గంగాధర్‌లు మాట్లాడుతూ తమను అన్యాయంగా విధులకు దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. చాలీచాలని జీతాలతో, కోవిడ్ సమయంలో ప్రాణాలు పణంగా పెట్టి సేవలు చేసామన్నారు. అందుకు కానుకగా ప్రభుత్వం, జిల్లా అధికారులు తమను ఉద్యోగాల నుండి తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వేతనాలు చెల్లించకుండా, నోటీసు ఇవ్వకుండా ఉన్నపలంగా తమను, తమ కుటుంబాలను రోడ్డున పడేశారని విచారం వ్యక్తం చేశారు. 2018 అక్టోబర్‌లో 483 మందిని రాష్ట్రవ్యాప్తంగా నియమించడంలో బాగంగా కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో 66 మందిని నియమించినట్టు తెలియజేశారు. జిల్లా అధికారులతో పాటు రాష్ట్ర అధికారులకు కూడా పలుసార్లు విన్నవించామన్నారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ డివిఎల్ నరసింహంను కలిసి తమ గోడు వినిపించుకున్నట్లు వారు తెలిపారు. 2021 సెప్టెంబర్‌లో, 65 మంది అప్కోస్ ఉద్యోగులను అక్రమంగా తొలగించారని, తిరిగి తమని విధులలోకి తీసుకోవాలని వారు విన్నవించారు.

యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు డివి రతన్ రాజ్, జిజిహెచ్ నాయకులు జి నాయుడు, శానిటేషన్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు సిహెచ్ విజయ్ కుమార్లు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నాయకులు పిఎస్ రాయుడు, సిహెచ్ ఏడుకొండలు, చక్రవర్తి, దుర్గా లక్ష్మి, అరుణ, వసంత, బేబి రాణి, లలిత, దయానంద్, రమణ, శ్రీనివాస్, పవన్, శివ శంకర్, ధనుంజయ్, ప్రసాద్, మౌలాలీ పాల్గొన్నారు.

20 నుంచి మేరీ లైఫ్ - మేరా స్వచ్ఛ షహర్

- 10రోజులపాటు పాత వస్తువుల సేకరణ
- కేంద్రాలు ఏర్పాటు : ఉత్తమ సేకరణకు కేంద్ర గుర్తింపు

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 5వ తేదీన కేంద్ర ప్రభుత్వ పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో మేరీ లైఫ్ -మేరా స్వచ్ఛ షహర్ అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కాకినాడ నగరపాలకసంస్థ కమిషనర్ ఆర్.మహేష్ కుమార్ చెప్పారు. కార్యక్ర మంలో భాగంగా ఈనెల 20వ తేదీ నుంచి 30వ తేదీ వరకు పది రోజులపాటు రీ సైక్లింగ్ ప్రక్రియకు ఉపయోగపడే పాత పుస్తకాలు, దుస్తులు, బొమ్మలు, ప్లాస్టిక్ ఇతర వస్తువులను పెద్ద ఎత్తున సేకరించ నున్నట్లు చెప్పారు. ఈ అంశంపై స్థానిక నగరపాలక సంస్థ కార్యాల యంలో కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌లు, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థి సంఘాలు, వివిధశాఖల అధికారులతో శనివారం సమావేశం ఏర్పాటు చేశారు. కమిషనర్ మాట్లాడుతూ పాత వస్తువుల సేకరణ కోసం కాకినాడ నగరంలోని ముఖ్యప్రాంతాల్లో కొన్ని కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామన్నారు.

ప్రజలు, సంస్థలు చైతన్యవంతులై తమ వద్ద నిరుప యోగంగా ఉండి రీసైక్లింగ్‌కు ఉపయోగపడే వస్తువులను ఆయా కేంద్రాలలో అందజేయాలని సూచించారు. సేకరించిన వస్తువులను రీసైక్లింగ్ ప్రక్రియకు వినియోగిస్తామన్నారు. 'రెడ్యూస్- రీ సైకిల్- రీ యూజ్' నినాదంతో చేపడు తున్న ఈ కార్యక్రమానికి ప్రజలంతా సహకరించాలని కమిషనర్ మహేష్ కుమార్ కోరారు. పది రోజులపాటు వీటిని సేకరించిన తరువాత జూన్ ఒకటో తేదీ నుంచి 4వ తేదీ వరకు ఆయా కేంద్రాలలో సేకరించిన వస్తువులు, నిర్వహణ ఆధారంగా మూడు టీమ్‌లను ఎంపిక చేసే ప్రక్రియ చేపడతామన్నారు. ఎంపికైన మూడు టీమ్‌లను కేంద్ర ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. అక్కడ ఎంపికయితే కేంద్ర స్థాయిలో ఆ టీమ్‌కు ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని కమిషనర్ చెప్పారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులను కూడా నియమించినట్లు ఆయన తెలియజేశారు. అదనపు కమిషనర్ సిహెచ్ నాగ నరసింహారావు మాట్లాడుతూ ఏయే ప్రాంతాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసేది త్వరలోనే ప్రకటిస్తామని, ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీల సంక్షేమ సమాఖ్య గౌరవాధ్యక్షులు వైడి రామారావు, నగరపాలక సంస్థ ఎస్ఈ పి..సత్యకుమారి, డిఈ మాధవీ, ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీచరణ్, టిపిఆర్ఓ మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, ఆల్ ఈజ్ వెల్ ప్రతినిధి కిషోర్, వివిధ శాఖల అధికారులు, కాలనీ సంక్షేమ సంఘాలు, సేవా సంస్థల ప్రతినిధులు, ఎఇలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు హాజరయ్యారు.

కొత్తపల్లిలో ఓ ఇంటి ఆవరణలో విరబూసిన మే పుష్పం

కనువిందు చేసిన 'మే' పుష్పం

ప్రజాశక్తి- యు. కొత్తపల్లి

మే నెలలో వికసించే పుష్పం కొత్తపల్లి గ్రామస్తులను కలువిందు చేసింది కొత్తపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి కాకరపల్లి గంగాధర శ్రీనివాస్ ఇంటి ఆవరణలో శనివారం పుష్పం విర బూయడంతో గ్రామ స్తుల్ని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ పుష్పాన్ని చూసేందుకు మహిళలు పిల్లలు బారులు తీరారు హిమాచల్ ప్రదేశ్ తీసుకు వచ్చిన పుష్పం యొక్క దుంప నాటడంతో 18 పుష్పాలు పూసాయని శ్రీనివాస్ తెలిపారు.

శంగార వల్లభ స్వామి ఆలయానికి రూ 3.22 లక్షల ఆదాయం

ప్రజాశక్తి - పెద్దాపురం

తిరుపతిలోని శ్రీశంగార వల్లభస్వామి ఆలయాన్ని శనివారం అధిక సంఖ్యలో యాత్రికులు సందర్శించారని ఆలయ ఇఒ పులి నారాయణమూర్తి తెలిపారు. ఒకరోజు వివిధ టిక్కెట్ల ద్వారా రూ 2,62,450, అన్నదాన విరాళాల ద్వారా రూ.49,084, కేశఖండన ద్వారా రూ.10,800 ఆదాయం సమకూరిందన్నారు. ఉదయం పులిహోర ప్రసాదం, మధ్యా హ్నం మహా అన్నదానం నిర్వ హించామన్నారు. అర్చకులు, కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, ఆలయ సిబ్బంది కృష్ణ, సత్య నారాయణ, అంజనీకుమార్, గ్రామస్తులు సహకారమందించారన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 1,750 కేసుల పరిష్కారం

కాకినాడ జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి

ప్రజాశక్తి - కాకినాడ క్రైమ్

కాకినాడ కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 1750 కేసులు పరిష్కరించామని న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, న్యాయమూర్తి పి.కమలాదేవి తెలిపారు. మొత్తం తొమ్మిది బెంచ్‌లు ఏర్పాటు చేయగా వీటిని న్యాయమూర్తి కమలాదేవి, నాలుగో అదనపు జిల్లా న్యాయమూర్తి హరినారాయణలు పరిశీలించారు. ఫోక్సో కోర్టు న్యాయమూర్తి ఎల్.వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వి.లీలాశ్యామసుందరి, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ప్రసన్నలక్ష్మి, మూడో అదనపు జెఎఫ్‌సిఎం. న్యాయ మూర్తి డి.శ్రీదేవి, నాలుగవ అదనపు జెఎఫ్‌సిఎం న్యాయమూర్తి నిరూప బండ డియో, ఐదవ అదనపు జెఎఫ్‌సిఎం న్యాయమూర్తి షేక్ షరీన్, స్పెషల్ మొబైల్ జెఎఫ్‌సిఎం న్యాయమూర్తి ఎన్.ఉష లక్ష్మి కుమారి, స్పెషల్ జెఎఫ్‌సిఎం ఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ న్యాయమూర్తి ఎ.నాగ మల్లేశ్వరిలు న్యాయ మూర్తులుగా వ్యవహరించారు. రోడ్డు ప్రమాదాలు, చెక్ బౌన్స్, రాజీ పడదగ్గ సివిల్, క్రిమినల్ కేసులను పరిష్కరించామని న్యాయ మూర్తులు తెలిపారు. తద్వారా రూ.9.86.73.225 మొత్తం కక్షిదారులకు లబ్ధి చేకూరిందని అన్నారు.

564 కేసులు పరిష్కారం

పెద్దాపురం కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో 564 కేసులు పరిష్కారం అయ్యాయని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎన్ సరస్వతి తెలిపారు. ఈ లోక్ అదాలత్‌ల నిర్వహణకు నాలుగు బెంచ్‌లు ఏర్పాటు చేశామన్నారు. మొదటి బెంచ్‌కు 7వ అదనపు జిల్లా జడ్జి ఎం.హరినారాయణ అధ్యక్షత వహించగా న్యాయవాది ఎస్.దుర్గారావు సభ్యులుగా, 2వ బెంచ్ కు సీనియర్ సివిల్ జడ్జి ఎన్ సరస్వతి అధ్యక్షులుగా న్యాయవాది ఏ ప్రభూజి సభ్యులుగా, 3వ బెంచ్‌కు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డి.శ్రీదేవి అధ్యక్షులుగా, న్యాయవాది ఎం.రాంబాబు సభ్యులుగా, 4వ బెంచ్ కు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.నాగమల్లేశ్వరి అధ్యక్షులుగా, న్యాయవాది బి.ప్రసాద్ సభ్యులుగా వ్యవహరించార న్నారు. ఈ జాతీయ లోక్ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేదుల సుబ్ర హ్మణ్యం (మణి) న్యాయవాది ఎస్ విశాలాక్షి, న్యాయ వాదులు పాల్గొన్నారు. ఈ లోక్అదాలత్‌కు హాజరైన కక్షిదారులకు రోటరీ క్లబ్, ఇన్నర్ వీల్ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఫలహారాలు, మజ్జిగ పంపిణీ చేశారు.

పెద్దపురంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సరస్వతి

బిసిలను మోసం చేస్తున్న వైసిపి ప్రభుత్వం

ప్రజాశక్తి - తాళ్లరేవు

బిసిలను వైసిపి ప్రభుత్వం మోసం చేస్తోందని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా బిసి సెల్ అధ్యక్షులు వాడ్రేవు వీరబాబు అన్నారు. తాళ్ళరేవు మండలం కోరంగి పంచాయతీ పెద్దబొడ్డు వెంకటాయపాలెంలో వాడ్రేవు వీరబాబు నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముఖ్య మంత్రిగా జగన్ పరిపాలన ప్రారంభించిన నాటి నుండి నేటి వరకూ సుమారు నాలుగేళ్లుగా బిసిలను అన్ని రకాలుగా మోసం చేస్తు న్నారని, బిసి సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టించారని, ప్రభుత్వ సలహా దారులుగా అందరూ రెడ్డిలనే నియమించారన్నారు. ఆ పదవులకి బి.సి.లు అర్హులు కాదా అని ప్రశ్నించారు. మందాల గంగ సూర్యనారాయణ, కట్టా త్రిమూర్తులు, టేకుమూడి లక్ష్మణరావు, పార్టీ మహిళా ఉపాధ్యక్షురాలు పొన్నమండ రామ లక్ష్మి మాట్లాడుతూ టిడిపి హయాంలో ఉండే 34 శాతం రిజర్వేషన్లను 24 శాతానికి కుదించారని, విదేశీ విద్య నిమిత్తం ఒకొక్క విద్యార్థికి రూ.10 లక్షలు కేటాయించేవారని, విద్యార్థులు చదువులు నిమిత్తం బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ ఉండేవని, మహిళలకు స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కార్యక్రమం జరిగేదని అన్నారు. దీనిఐ బి.సి.లు అందరిని ఐక్యంచేసి త్వరలో పోరాటం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పొన్నాడ ఈశ్వరరావు, పెమ్మాడి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వాడ్రేవు వీరబాబు

వేసవి విజ్ఞాన శిబిరం దేశరక్షణపై అవగాహన కల్పిస్తున్న టీచర్

జై జవాన్ - జై కిసాన్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞానశిబిరంలో శనివారం దేశ రక్షణ కోసం సైనికులు నిర్వహిస్తున్న పాత్ర, దేశ ప్రజలందరికీ ఆహారం అందించ డంలో రైతులు చేస్తున్న కృషి వంటి అంశాలపై వాడపల్లి విమలా రాణి, సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు డాక్టర్ జోష్యుల కృష్ణ బాబు నీతి పద్యాలపై, సాహితీ స్రవంతి పట్టణ కార్యదర్శి కొత్త శివ తెలుగు వ్యాకరణంపై వివరించారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగ రాజు, సిబ్బంది సింగం బుల్లయ్య, మరియమ్మ, పాఠకులు పాల్గొన్నారు.

కర్రసాము ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శిక్షణతో మరిన్ని అద్భుతాలు

ప్రజాశక్తి - పెద్దాపురం

వివిధ అంశాలపై విద్యార్థులకు శిక్షణ ఇవ్వడం ద్వారా వారు నూతనోత్సాహంతో అద్భుతాలు సృష్టిస్తారని కాకినాడ అంజు ఇంటర్నేషనల్ ఐ కేర్ వైస్ చైర్మన్, డైరెక్టర్ డాక్టర్ డి.తేజేశ్వర వరప్రసాద్ అన్నారు. స్థానిక రామారావు పేటలోని శ్రీ ప్రకాష్ సినర్జీ స్కూల్లో 14 రోజులపాటు నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం శనివారం సాయంత్రం ముగిసింది. శ్రీ ప్రకాష్ డైరెక్టర్ సిహెచ్ విజయ్ ప్రకాష్ అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. విజయ ప్రకాష్ మాట్లాడుతూ గత నెల 30 నుండి ఈ నెల 13 వరకు జరిగిన ఈ శిక్షణా శిబిరంలో విద్యార్థులకు క్రికెట్, బాస్కెట్ బాల్, స్కేటింగ్, గుర్రపు స్వారీ, కర్ర సాము, థియేటర్ ఆర్ట్స్,రోప్ స్కిప్, రోబో టెక్స్,మ్యూజిక్, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, స్విమ్మింగ్‌లలో శిక్షణ ఇచ్చారన్నారు. సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవివి ఎస్ మూర్తి, ప్రొఫెసర్ ఎస్సార్ సంతానం పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ప్రజాశక్తి - ఏలేశ్వరం

రాష్ట్రంలోని కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఎపిజిసిఇఎఫ్ జోనల్ కన్వీనర్ డాక్టర్ వి.కనక రాజు శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల మేని ఫెస్టోలో ఉద్యోగుల క్రమబద్ధీకరణ అంశంపై ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి నిలుపుకోవాలన్నారు. ఇటీవల తెలంగాణతో పాటు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాయన్నారు. నాలుగేళ్లు అధ్యయనం చేసిన చీఫ్ సెక్రెటరీ ఆధ్వర్యంలో అధ్యయన కమిటీ నివేదిక ప్రకారం వివిధ శాఖలలో 13 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నట్లు నివేదిక ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ శాఖలో పని చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులర్ చేయించాలని ఆయన డిమాండ్ చేశారు.

కార్టూ'నిజం'

ఈ ఏడాది అన్నీ సాధారణమేరా..
ఒక్క ధరల పెరుగుదల తప్ప..!!

104 ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం

104 ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ముఖ్యకేంద్రాల్లో 104 ఉద్యోగులు పిహెచ్‌సిలు, సచివాలయాల వద్ద నిరసన తెలియజేశారు.

కరప మండలం అర్థగట్ల సచివాలయం 104 ఉద్యోగులు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కాకినాడ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం త్రిమూర్తులు ఉపాధ్యక్షురాలు ఇందుమతి మాట్లాడుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని, పిఎఫ్ అరబిందో యాజమాన్యం చెల్లించవలసిన వాటా యాజమాన్యం వారే చెల్లించే విధంగా ఐదు నుండి 10 ఏళ్ల సర్వీస్ పూర్తయిన సీనియర్ డ్రైవర్లకి స్లాబ్ సిస్టం అమలు చేసే విధంగా ప్రభుత్వ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 104 ఉద్యోగులుగా, ఆశ వర్కర్లు పాల్గొన్నారు. **పెద్దాపురం** మండలం కాండ్రకోట ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వద్ద 104 ఉద్యోగులు నిరసన తెలిపారు. ఉద్యోగ సంఘాల నాయకులు కె వెంకట రావు, కె.రాధాకృష్ణలు మాట్లాడుతూ తమకు రావలసిన జీతాల బకాయిలన్నీ వెంటనే విడుదల చేయాలని, తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

అరట్లకట్టలో నిరసన వ్యక్తం చేస్తున్న 104 సిబ్బంది

కాండ్రకోటలో నిరసన వ్యక్తం చేస్తున్న 104 సిబ్బంది


ఏలేశ్వరంలో స్వీట్లు పంపిణీ చేస్తూ హర్షం వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి - ఏలేశ్వరం

కర్ణాటక శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించడంతో ప్రత్తిపాడు అంబేద్కర్ కళామందిర్ సెంటర్లో కాంగ్రెస్ శ్రేణులు మిఠాయిలు పంచి, బాణాసంచాలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఉమ్మడి వెంకటరావు మాట్లాడుతూ కర్ణాటక ప్రజలు లౌకిక వాదాన్ని స్వాగతించారన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రంలో కూడా లౌకికవాద కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను, ఎస్‌సి సెల్ అధ్యక్షుడి మొయ్యేటి సూర్యప్రకాశ రావు, బీసీ సెల్ అధ్యక్షుడు కొల్లి వీర గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పన వెంకటేశ్వరరావు, కార్యకర్తలు దాసరి సత్తిబాబు, కందుమల్ల శామ్యూల్ పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

అత్త హత్య కేసులో కోడలు అరెస్ట్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

అత్తను హత్య చేసిన కోడలును పోలీసులు శనివారం అరెస్టు చేశారు. కోర్టులో హాజరు పర్చగా ఆమెకు 14 రోజుల రిమాండ్‌ను న్యాయమూర్తి విధించారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఆత్రేయపురం దళితపేటలో నక్క మహాలక్ష్మి నివాసం ఉంటుంది. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. పిల్లల ముగ్గురికీ ఆమె వివాహం చేసింది. కుమార్తెలు వారి అత్తారింట్లో ఉంటున్నారు. మహాలక్ష్మి కుమారుని వద్ద ఉంటోంది. ఇటీవల కాలంలో మహాలక్ష్మికి ఆమె కోడలు బుజ్జమ్మకు తరచూ గొడవలు జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో అత్తను హతమార్చాలని బుజ్జమ్మ పథకం వేసింది. ఈనెల 9న ఇంట్లో నిద్రిస్తున్న అత్తను హత్య చేసింది. అనంతరం ఏమీ తెలియనట్టుగా వ్యవహరించింది. మహాలక్ష్మి కుమార్తెలు బుజ్జమ్మపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమెను పోలీసులు అదుపులో తీసుకొని విచారించారు. హత్య చేసినట్లుగా అంగీకరించడంతో సిఐ రజనీకుమార్ ఆధ్వర్యంలో ఆమెను శనివారం అరెస్ట్ చేసి కొత్తపేట కోర్టులో హాజరు పరిచారు. 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి అమలాపురం రూరల్

వ్యక్తి అదృశ్యమైనట్టు అమలాపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ ఎ.పరదేశి తెలిపిన వివరాల మేరకు అమలాపురం మండలం ఎ.వేమవరం నామాలవారి పాలేనికి చెందిన వనచర్ల బాలవెంకట సత్యనారాయణ అలియాస్ చిన్ని(44) ఈనెల 9వ తేదీ మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆయన సోదరుడు వనచర్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు. అతని వివరాలు ఎవరికైనా తెలిస్తే 9440796562, 08856231066 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

జొన్నాడలో హిజ్రా దారుణ హత్య

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని జొన్నాడ పంట కాలువ చెంతన ఒక హిజ్రా హత్యకు గురైంది. హిజ్రా పశ్చిమగోదావరి జిల్లా మాధవరం మండలం ఉప్పరగూడెం గ్రామానికి చెందిన మరిపట్ల ఆనంద్(33)గా గుర్తించారు. ఘటనా స్థలాన్ని డిఎస్‌పి కె.వెంకటరమణ, రావులపాలెం సిఐ రజనికుమార్, ఎస్ఐ వెంకటరమణ శనివారం పరిశీలించారు. శుక్రవారం రాత్రి గుర్తితెలియని వ్యక్తులు హత్యచేసి పంటకాలువలో పడేశారని, స్థానికుల సమాచారంతో ఘటనా స్థలాన్ని పరిశీలించామని వారు తెలిపారు. వేలిముద్ర నిపుణులు, డాగ్ స్క్వాడ్ బృందం ఎస్ఐ ఎస్.శివప్రసాద్ ఆధ్వర్యంలో ఆధారాలు సేకరించారు. మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న కుటుంబ సభ్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరుకు చెందిన మల్లాడి నూకరాజు(29) శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కోరంగి పోలీస్‌స్టేషన్ వద్ద శనివారం ఆందోళనకు దిగారు. కోరింగ ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. కొత్తూరుకు చెందిన నూకరాజు కాకినాడ పోర్టులో కార్మికునిగా పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. శుక్రవారం రాత్రి కాకినాడ నుంచి కొత్తూరులో ఇంటికి తిరిగి వస్తుండగా లారీ ఢీకొట్టడంతో మృతి చెందాడు. దీంతో నూకరాజు కుటుంబం రోడ్డున పడింది. నూకరాజు కుటుంబానికి న్యాయం చేయాలని బంధువులు కోరంగి పోలీస్ స్టేషన్ ఎదుట శనివారం ఆందోళన చేశారు. న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

వ్యక్తిపై కత్తెరతో దాడి

సీతానగరం : వ్యక్తిపై కత్తెరతో దాడికి దిగన ఘటన ఉండేశ్వరపురంలో చోటు చేసుకుంది. ఉండేశ్వరపురానికి చెందిన ఉప్పలపాటి శ్రీనివాసరావు కొద్ది కాలంగా భార్యతో గొడవపడి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఉంటున్నాడు. అంగన్‌వాడీ కేంద్రం వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో అక్కడ ఉండొద్దని అదే గ్రామానికి చెందిన సింహాద్రి సురేష్‌బాబు పలుమార్లు శ్రీనివాసరావును హెచ్చరించాడు. సురేష్‌బాబు తల్లి అదే కేంద్రంలో అంగనవాడి టీచర్‌గా పని చేస్తుంది. శుక్రవారం కూడా శ్రీనివాసరావు అంగన్‌వాడీ కేంద్రం వద్దనే ఉండటంతో మరోమారు సురేష్‌బాబు హెచ్చరించాడు. అక్కడ నుంచి వెళ్లిపోవాలని చెప్పడంతో సురేష్‌బాబుతో శ్రీనివాసరావు గొడవపడ్డాడు. కత్తెరతో సురేష్‌బాబుపై దాడి చేశాడు. వెంటనే స్థానికులు సురేష్‌బాబును రాజమహేంద్రవరంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి వైద్యుల సమాచారం మేరకు సీతానగరం హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణరావు నిందితునిపై ఎస్‌సి, ఎస్‌టి కేసు నమోదు చేవారు. నార్త్ జోన్ డిఎస్‌పి కడలి వెంకటేశ్వరరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

కళ్లాల్లో ధాన్యం కళ్లల్లో దైన్యం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రహసనంలా మారింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలులో ప్రభుత్వానికి పూర్తిగా చిత్తశుద్ధి కొరవడిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాలో అకాల వర్షాలతో ధాన్యం తడిచిపోయి, పంటను కోల్పోయి అన్నదాతలు పూర్తిగా నష్టపోయారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని ఎండగడుతూ ఎపి రైతు సంఘం రాష్ట్ర నాయకత్వం, టిడిపి అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ జిల్లాలో పర్యటించి రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తక్షణమే ధాన్యం కొనుగోలు చేయాలని లేనిపక్షంలో ప్రజా ఉద్యమం చేపడతామని హెచ్చరించి రైతుల పక్షాన నిలబడ్డారు. అధికార యంత్రాంగం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు, పంట నష్ట పరిహారం చెల్లింపునకు ఎన్యూమరేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. ధాన్యం కొనుగోలు రైస్ మిల్లర్ల చేతి వాటానికి తూర్పుగోదావరి జిల్లాలో బ్రేక్ పడింది. తాలు, తేమ పేరుతో క్వింటాకు ఆరు కేజీల చొప్పున తరుగు తీసి నగదు వసూళ్లు చేయడంపై పలు ఫిర్యాదులందాయి. దీనిపై కలెక్టర్ మాధవీలత విచారణ నిర్వహించారు. రెండు రైస్ మిల్లులను సిఎంఆర్ నుంచి తొలగించారు. కోనసీమ, కాకినాడ జిల్లాల్లోనూ ఇప్పటికీ ఈ రకమైన దోపిడీ కొనసాగుతోంది. అధికారులు విచారణ చేపట్టి తమను ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు. మరో వైపు జిల్లాలో నిర్వహిస్తున్న పంటనష్టం లెక్కింపు ప్రక్రియ సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది.పూర్తిగా నష్టపోయిన పంటకు మాత్రమే ఎన్యుమరేషన్ జరుగుతోంది. సాంకేతిక కారణాలు సాకుగా చూపించి అధిక శాతం పంటను ఎన్యుమరేషన్ చేయటంలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు బాధ్యతా యుతంగా వ్యవహరించి న్యాయం చేయాలని జిల్లా రైతాంగం విజ్ఞప్తి చేస్తోంది.

మహానాడుకు సమాయత్తం

టిడిపి ఎన్నికల శంఖారావం పూరించేందుకు తొలి అడుగు వేసింది. ఆ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఎన్‌టిఆర్ శత జయంతి వేడుకలు నిర్వహిస్తున్న ఈ ఏడాది రాజమహేంద్రవరంలో మహానాడు నిర్వహించడం మరింత ప్రత్యేకత సంతరించుకుంది. మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ ఇక్కడి నుంచే ఎన్నికల శంఖారావం పూరించి రాష్ట్ర రాజకీయాల్లో కొత్త అధ్యాయం సృష్టించిన విషయం విధితమే. అదే స్ఫూర్తితో ఈ నెల 27, 28 తేదీల్లో వేమగిరిలో మహానాడు నిర్వహించేందుకు ఆ పార్టీ నాయకులు సన్నద్ధమయ్యారు. రాష్ట్రంలోని టిడిపి అభిమానులు, కార్యకర్తలతో పాటు దేశ విదేశాలనుంచి డెలిగెట్స్ తరలి రానున్నారని సమాచారం. సుమారు 10 లక్షల మందితో ముగింపు సభ నిర్వహించేందుకు సన్నాహకాలు చేస్తున్నామని ఆ పార్టీ సీనియర్ నేతలు చెబుతున్నారు.

తండ్రి, తనయునికి బెయిల్

చిట్‌ఫండ్ కేసులో అరెస్టయి సెంట్రల్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న మాజీ ఎంఎల్‌సి ఆదిరెడ్డి అప్పారావు, ఆయన తనయుడు, సిటీ ఎంఎల్‌ఎ భర్త ఆదిరెడ్డి వాసు ఎట్టకేలకు బెయిల్‌పై విడుదలయ్యారు. మహానాడు వేళ ఆదిరెడ్డి అరెస్టులు వేడిని పుట్టించాయి. అరెస్టులపై టిడిపి శ్రేణులు రోడ్డెక్కాయి. కావాలనే కక్షపూరితంగా అధికార పార్టీ అరెస్టులు చేయించిందని ఆరోపణలు గుప్పించాయి. చంద్రబాబు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సైతం ఆదిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించాయి. ఎట్టకేలకు వారి విడుదలతో ఆ కేడర్‌లో మళ్లీ ఉత్సాహం ఉప్పొంగింది.

జిఒ 1 రద్దు మరో చెంపపెట్టు

ప్రజలు, ప్రతిపక్ష పార్టీల ప్రజా స్వామ్య హక్కులను కాలరాసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 1ను హై కోర్టు రద్దు చేయడం పాలక పక్షానికి చెంప పెట్టు అనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. సమస్యపై ప్రశ్నించిన ఉద్యోగులను, కార్మికులను వారి పక్షాన గొంతుకై పోరాడుతున్న పార్టీలపై ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరిస్తోంది. ముందస్తు అరెస్టులు, నిర్భంధాలతో నియంతలా వ్యవహరిస్తుంది. ఈ వైఖరిని కొనసాగించేందుకు జిఒ 1ను తీసుకొచ్చింది. దీనిపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. ప్రజలు, ప్రజా సంఘాలు ముక్త కంఠంతో వ్యతిరేకించి ప్రత్యక్ష ఆందోళనలతో పాటు చేసిన న్యాయ పోరాటం విజయం సాధించింది. ఈ జిఒను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది.

విద్యుత్ శాఖ 'సర్దు'పోటు

సర్దు బాటు ఛార్జీల పేరుతో విద్యుత్ శాఖ వినియోగదారుల నడ్డివిరుస్తోందని సర్వత్రా విమర్శలు విన్పిస్తున్నాయి. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యుత్ ఛార్జీలు ఏడాదికి ఒకటి లేదా రెండు సార్లు పెరుగుతూనే ఉన్నాయి. ట్రూ అప్, అడిషనల్ ఛార్జీలు రక రకాల పేర్లతో గోళ్లూడపీకుతోంది. గతంలో ఎవరో వినియోగించిన కరెంటుకు ఇపుడు మేం ఎలా కడతామనే ప్రశ్న అద్దె దారుల నుంచి వ్యక్తమవుతోంది. విద్యుత్‌శాఖ నుంచి ఈ ప్రశ్నకు సమాధానం లభించడంలేదు. బిల్లులు చెల్లించకపోతే ఫీజులు తొలగిస్తామంటూ హెచ్చరికలు జారీ చేసి మరింత భయాందోళనలకు గురి చేస్తున్నారు. ఓ వైపు నిత్యావసర సరకుల ధరలు, పన్నుల భారాలు ఆశాన్నంటుతున్న విషయం విధితమే. సర్దుపోటుపై పాలనా యంత్రాంగం పునరాలోచించుకోపోతే మూల్యం చెల్లించుకోక తప్పదనే పలువురు హెచ్చరిస్తున్నారు.

ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం...

- పండిన ప్రతి గింజనూ కొనుగోలు చేస్తాం
- ఎపి రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీరభద్రారెడ్డి

ప్రజాశక్తి - కాకినాడ

ఇటీవల కురిసిన వర్షాల కారణంగా నష్టపోయిన రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేయడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్ర రెడ్డి అన్నారు. శనివారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దాళ్వా సాగు చేతికందే సమయంలో అకాల వర్షాలు కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఆర్బికేలు ద్వారా ప్రతి గింజ కొనుగోలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి ప్రత్యేక అధికారిని కూడా నియమించినట్లు తెలిపారు. ఆర్‌బికెల నుండి కొనుగోలు చేసిన ధాన్యాలు చెల్లింపులకు సంబంధించి ఒకటి నాలుగు నిష్పత్తి బ్యాంకు గ్యారంటీ సౌకర్యం రైస్ మిల్లర్లకు కలిగించినట్లు తెలిపారు. ప్యాడీ కి సంబంధించి తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయడానికి అలాగే బాయిల్డ్ రైస్ సంబంధించి ఐదు లక్షల టన్నులకు కేంద్ర ప్రభుత్వం నుండి అనుమతులు తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ఆర్‌బికెల ద్వారా స్వీకరించిన ధాన్యం తిరిగి లెవీ రూపంలో ప్రభుత్వానికి అందజేయడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందని తెలిపారు. సరిహద్దు రాష్ట్రం తెలంగాణలో 50 లక్షల టన్నులు బకాయిలు ఉన్నాయని వాటితో పోలిస్తే మన రాష్ట్రంలో సేకరించిన ప్రతి గింజ సద్వినియోగం చేయడం జరుగుతుందని తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రైతాంగ సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన ఈ కొత్త వ్యవస్థ ద్వారా రైతులు ఎవరూ మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరం లేకుండా నేరుగా తమ ధాన్యాన్ని ఆర్ బి కే లకు అమ్ముకునే అవకాశం ఉందని అలాగే దళారీలను ఆశ్రయించొద్దని సూచించారు. దళారీ వ్యవస్థ పూర్తిస్థాయిలో నిర్మూలన చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో కోనసీమ జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధక్షుడు వేగుళ్ళ పట్టాభి రామయ్య చౌదరి, తూర్పుగోదావరి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమిల్లి బుల్లి మోహన రెడ్డి తదితరులు ఉన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వీరభద్రారెడ్డి

ఎన్‌సిసితో క్రమ-శిక్షణ

- తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు

ప్రజాశక్తి- పెద్దాపురం

ఎన్‌సిసితో విద్యార్థులకు దేశభక్తి, క్రమశిక్షణ, నిబద్ధత అలవడతాయని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి నామవరపు రాజేశ్వరరావు అన్నారు. స్థానిక నవోదయ విద్యాలయలో గత 12 రోజులుగా జరుగుతున్న ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సిసి డైరెక్టరేట్ ఐ డిఎస్ ఎస్ సి-2023 కొరకు ఎంపికైన క్యాడెట్ ల శిక్షణా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ పర్ఫెక్ట్ పర్సనాలిటీకి ఎన్‌సిసి ఒక గొప్ప అవకాశం అన్నారు. క్రమ శిక్షణతో కృషి చేస్తే గొప్ప భవిష్యతుత ఉంటుందన్నారు. ఎటిసి 1 కమాండెంట్ కల్నల్ వివేక్ సావన్ గౌడర్ క్యాంపు గురించి ఆయనకు వివరించారు. కార్యక్రమంలో కమాండర్ కల్నల్ రిషి, నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ కె.రామిరెడ్డి ,క్యాంపు అడ్జటెంట్ కిషోర్, 540 మంది క్యాడెట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి రాజేశ్వరరావు

రానున్న మూడు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రానున్న మూడు రోజుల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్నా యని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకూ ఎండలో బయటకు వెళ్లారాదన్నారు. తప్పని సరి పరిస్థితుల్లో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీహైడ్రేషన్‌కు గురికాకుండా ద్రవ పదార్థాలను ఎక్కువగా తీసుకోవాలని ప్రకటనలో పేర్కొన్నారు.

బిసిలకు జగన్ సర్కారు అన్యాయం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

రాష్ట్రంలోని బిసిలకు జగన్ సర్కారు తీవ్ర అన్యాయం చేసిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి, రజక, దాసరి, సాధికార కమిటీ రాష్ట్ర కో ఆర్డినేటర్ కాకినాడ రామారావు, బిసి సంఘం జిల్లా అధ్యక్షులు పైలా సాంబశివరావు అన్నారు. శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో బిసిల సత్తా చాటాలన్నారు. జగన్‌ను గద్దె దింపేందుకు ప్రతి బిసి సోదరుడు నడుం బిగించాలన్నారు. ఈ నెల 18 నుంచి 22 వరకూ పోరుబాట నిర్వహిస్తున్నామన్నారు. వీటిని విజయవంతం చేయాలన్నారు. అన్నదమ్ములుగా ఉండే బిసిలను జగన్ విడదీసి కార్పొరేషన్లు పెట్టారన్నారు. ఈ కార్పొరేషన్లకు రూపాయి కూడా ఇవ్వకుండా నాలుగేళ్ల పాటు కాలం గడిపేశారన్నారు. బిసిలకు న్యాయం చేసింది టిడిపి మాత్రమేనన్నారు. బిసిలు అభివృద్ధి చెందాలంటే టిడిపిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. జగన్ చేస్తున్న అన్యాయాన్ని అన్ని మండల నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున పోరు బాట ద్వారా ప్రజలకు వివరించాలన్నారు. ఈ వీటిని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పెంకె వెంకటేష్, శ్రీనివాస్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల సంఘీభావం



చిన్నకొత్తూరులో పర్యటిస్తున్న నానాజీ

నిబంధనలు సడలించాలి

ప్రజాశక్తి -కరప

ఇటీవల కురిసిన వర్షాలకు తడిసిన, మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనలు సడలించి కొనుగోలు చేయాలని రూరల్ జనసేన ఇన్‌చార్జ్ పంతం నానాజీ అన్నారు. శనివారం చిన కొత్తూరులో గ్రామ జనసేన పార్టీ అధ్యక్షులు అల్లు గంగాద్రి ఆధ్వర్యంలో జనం కోసం పవన్ -పవన్ కోసం మనం కార్యక్రమంలో ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటన చేస్తున్న నానాజీకి రైతులు గ్రామస్తులు సమస్యలు తెలిపారు. కార్యక్రమంలో అల్లు గంగాద్రి,చింత వెంకట్, బండారు మణికంఠ, రెడ్డి రాజు, సంజయ్, గోపి , బోగి బోగిరెడ్డి కొండబాబు, బండారు మురళి, గంగాధర్, యాళ్ల పండు, వెంకటేశ్వర్లు, రమణ, శిరంగు శ్రీనివాస్, తాటికాయల వీరబాబు, కరెడ్ల గోవింద్, రెడ్డిపల్లి కిషోర్ పాల్గొన్నారు.

భార్యపై కత్తితో దాడి

ప్రజాశక్తి - సీతానగరం

భార్యపై కత్తితో దాడి చేసిన ఘటన చీపురుపల్లి గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. చీపురుపల్లికి చెందిన పెద్దె నాగమణి, భర్త పెద్దె అర్జున్‌కు మధ్య గొడవల నేపథ్యంలో కొంత కాలంగా వారు విడిగా ఉంటున్నారు. గొడవల నేపథ్యంలో నాగమణి గతంలో భర్తపై కేసు పెట్టింది. ఈ విషయమై కోపంతో శనివారం ఆమెపై అర్జున్ కత్తితో దాడి చేశాడు. ఈ దాడిలో నాగమణి మెడ, కుడిచేయి, వీపుపై గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను వెంటనే ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ ఎంజి. రాజు కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరుస్తామని కోరుకొండ సిఐ ఉమామహేశ్వరరావు తెలిపారు.

ఖర్చులు త్రిపురాంతకస్వామికి ఎరుక

కళావిహీనంగా నీలకంఠేశ్వర ఆలయం

కల్యాణానికీ ఆలయానికి రంగులు కరువు

20 ఏళ్లుగా ఖర్చులు చెప్పని ఇఒ

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని శివల గ్రామంలో బాలా త్రిపుర సుందరి సమేత నీలకంఠేశ్వర త్రిపురాంతకస్వామి ఆలయానికి 13 ఎకరాలు పంట భూమితో పాటు ధూప దీప నైవేద్యాలకు మరో ఐదున్నర ఎకరాలు వెరసి మొత్తం 18 ఎకరాలు పంట భూములు ఉన్నాయి. గత 20 ఏళ్లగా దేవస్థానం ఇఒ సత్యనారాయణ జమా ఖర్చులు చెప్పడం లేదని కనీసం ట్రస్ట్ బోర్డు కు కూడా ఖర్చులు చెప్పడం లేదని గ్రామ సర్పంచ్ అనసూరి సాయి బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆల యానికి కనీసం రంగులు కూడా వేయలేద న్నారు. స్వామివారి కల్యాణానికి కూడా రంగులు వేయకపోవడంతో ఆలయం పాతబడిపో యినట్లు కళావిహీనంగా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పై అధికారులకు ఫిర్యాదు చేశానని ఆయన 'ప్రజాశక్తి'కి వివరించారు. ఎప్పటికైనా ఇఒ స్పందించి ఆలయం జమా ఖర్చులు తేల్చాలని ఆలయానికి రంగులు వేయించాలని ఆలయ అభివద్ధికి కషి చేయాలని గ్రామ సర్పంచ్ సూరిబాబుతో పాటు పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

రూ.4 లక్షల బకాయిలు అందాలి : ఇఒ

శివల దేవస్థానం ఇఒ ఎంవివి.సత్య నారాయణ ఆలయ ఖర్చులు పైన ఆదాయం పైన జమా ఖర్చులు 20 ఏళ్లగా చెప్పకపోవడంపై వివరణ కోరగా.. గ్రామంలోని రైతులు వద్ద నుంచి సుమారు రూ.4 లక్షలు బకాయిలు ఉన్నాయన్నారు. బకాయిలు వసూలైతేనే ఖర్చులు చెప్పడం వీలవుతుందని వివరించారు. అదేవిధంగా పండగలకు తానే స్వయంగా ఖర్చులు పెడుతున్నానని దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బకాయిల వసూల్లో సహకరించాలని ఇఒ తెలియజేశారు. అదేవిధంగా రంగుల కోసం అంచనాలను వేశామని ఆమోదం కోసం చూస్తున్నట్లు ఆయన చెప్పారు.

త్రిపురాంతకస్వామి ఆలయం

యానాం వార్తలు

నవోదయలో నూరు శాతం ఉత్తీర్ణత

ప్రజాశక్తి - యానాం

యానాం పట్టణంలోని స్థానిక మెట్టకూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 10,12 వ తరగతి పరీక్ష ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ టివిఎస్ ప్రకాష్‌రావు శనివారం తెలిపారు. సిబిఎస్ఇ బోర్డు శుక్ర వారం ఫలితాలను ప్రకటించగా పదవ తరగతి ప్రథమ స్థానంలో ఉలిసి మోహిత శ్రీ సాయిహాసిని 93.8 శాతం, యర్రంశెట్టి యోగ లక్ష్మి 92 శాతం, ద్వితీయ స్థానంలో జి దివ్యాన్ష 89.4 శాతం, శ్రీ సాయి రాజు తృతీయ స్థానంలో నిలిచారన్నారు. 12వ తరగతి ప్రథమ స్థానంలో మల్లాది శివకాశి 86.6 శాతం, ద్వితీయ స్థానంలో బి.లాస్య 85.6 శాతం, ఎల్.సాయి నాయుడు తృతీయ స్థానంలో నిలిచారన్నారు.ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రకాష్ రావు, అధ్యాపకులు అభినందించారు.

ఉలిసి మోహిత శ్రీ సాయి హాసిని (93.8 శాతం)

కేకును కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకుడు దినేష్ తదితరులు

కాంగ్రెస్ సంబరాలు

కర్ణాటకలో విజయం పట్ల యానాంలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు నిర్వహించాయి. కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షులు అర్దాని దినేష్ ఆధ్వర్యంలో కార్యకర్తలు బాణసంచా కాల్చారు. కేక్‌లు కట్‌చేసి పంచారు. స్వీట్లు తినిపించుకున్నారు. ఈ దినేష్ మాట్లాడుతూ త్వరలో పుదుచ్చేరి రాష్ట్రంలోని, యానాం నియోజవర్గంలోని కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేస్తామన్నారు. బిజెపికి కర్ణాటక ప్రజలు సరైన బుద్ధి చెప్పారన్నారు.రానున్న రోజుల్లో దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందన్నారు. దీనికి కర్ణాటక ఎన్నికల ఫలితాలే నిదర్శనమన్నారు.

యంత్రంతో కూల్చేస్తున్న మున్సిల్ ప్రహరీ

మున్సిపల్ కార్పొరేషన్ ప్రహరీ ధ్వంసం

భారీ వాహనాల రాకపోకలతో రోడ్లు ఛిద్రమవుతున్నాయి అట్టలఫ్యాక్టరీ- భీమ్‌నగర్ రోడ్డు ప్రాంత వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యానాం పట్టణ పరిధిలో పలు ప్రభుత్వ కట్టడాలను అక్రమార్కులు ఛిద్రం చేస్తున్నప్పటికీ స్థానిక అధికారులు పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక స్త్రాబోర్డు అట్టల ఫ్యాక్టరీ నుంచి భీమ్ నగర్‌కు వెళ్లే రహదారిలో గతంలో వంద మీటర్ల మేర లక్షల రూపాయల మున్సిపాలిటీ నిధులతో భారీ ప్రహరీని నిర్మించారు. ఇటీవలి అట్టల ఫ్యాక్టరీ స్థలాన్ని ఒక వ్యక్తి కొనుగోలు చేశాడు. దాన్ని లేఅవుట్‌గా మార్చారు. దీని కోసం అడ్డుగా ఉందని మున్సిపాలిటీ ప్రహరీని కూల్చేశాడు. దీనిపై స్థానికులు అధికారులకు పిర్యాదు చేసినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని వారు తెలిపారు. ఇదిలా ఉండగా శనివారం పొక్లెయినర్లు, భారీ వాహనాల రాకపోకలను నిర్వహించడంతో రహదారి మొత్తం ఛిద్రం అయ్యిందని స్థానికులు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులకు నష్టం చేకూర్చడంపై గవర్నుకు ఫిర్యాదు చేశామని వారు తెలిపారు.

సరుకులు అందిస్తున్న అనిత

నిత్యావసర సరుకుల అందజేత

యానాంలో స్థానిక అంబేద్కర్ నగర్‌లో 35 ఏళ్లుగా నివాసం ఉంటున్న నీరుపూడి సత్యనారాయణ కుటుంబానికి స్థానిక నాయకురాలు దుగ్గదుర్తి అనిత ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులను శనివారం అందించారు. సత్యనారాయణ రీజెన్సీ ఫ్యాక్టరీలో పనిచేసేవారని, ఫ్యాక్టరీ మూతపడడంతో కుటుంబం రోడ్డును పడిందని తెలిపారు. ఆయనకు కళ్లు కూడా సరిగా కనిపించట్లేదన్నారు. విషయం తెలుసుకున్న తాను పలువురి సాయంతో నిత్యావసర సరుకులు అందించామని తెలిపారు. ఆమె వెంట రొయ్య ప్రసన్నకుమార్, జయరాం, పైడికొండల రాజా, మోకా రామలక్ష్మి తదితరులున్నారు.

ప్రమాదాలు జరగకుండా చర్యలు

ప్రజాశక్తి - తాళ్లరేవు

జాతీయ రహదారి 216 పై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నట్లు కాకినాడ డిఎస్‌పి మురళీకృష్ణ తెలిపారు. చొల్లంగి నుంచి సుంకరపాలెం జంక్షన్ వరకు గల 6 పాయింట్లను శనివారం రాత్రి కాకినాడ రూరల్ సీ.ఐ. శ్రీనివాస్ కోరింగ ఎస్ఐ శ్రీనివాస్ కుమార్‌లతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మురళీకష్ణ మాట్లాడుతూ ప్రతి నాలుగు రోడ్ల కూడలిలోను తారు డబ్బాలు జిగ్‌జాగ్ రూపంలో ఏర్పాటు చేయాలని ఎస్ఐ శ్రీనివాస్ కుమార్ కు సూచించారు. శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాద ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కోరంగి ఎఎస్ఐ. సత్యనారాయణ, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

NAME CHANGE

I, **MOHAMMAD JAMEELA KHANAM, W/o.MOHAMMAD AZAZ ALI KHAN,** Age : 47 Years, Resident at of D.No.2-8-2, Bukkapeta Road, Nidadavole, Nidadavole Mandal, E.G.Dist. Do hereby inform to the public that my Name **JAMELA KHANAM(Old Name)** has been changed **MOHAMMAD JAMEELA KHANAM** (New Name) for all transactions.

ప్రకటన

నా క్లయింట్ అయిన తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్ వారిచే పద్మావతి నగర్ BA No. 176/2013-G5 గా అప్రూవల్ పొంది బిల్డర్‌గా **"GK Royale"** అను పేరుతో నిర్మించియున్న R.S. 406/2B Flats లో 3rd Floor Flat No. 402 నివసిస్తున్న కాపురస్తులు **యేలేశ్వరపు వెంకటశాస్త్రి గారు కుమారుడు యేలేశ్వరపు శ్రీ ఫణీంద్ర** ఇచ్చిన సంజాయిషీపై యావన్మందికి తెలియచేయునది ఏమనగా,

నా క్లయింట్ ది. 11-3-23 సం॥ తేదీన Schedule Flat తాలూకు ఆస్తి ఒరిసినల్ దస్తావేజు ది. 25-3-2015 తేదీన No. 3276/2015 గా రిజిష్టర్ కాబడిన దస్తావేజు తీసుకొని హౌస్ షిఫ్టింగ్ సందర్భములో సదరు సామానులతో పాటు మేము శ్రీరామ్ నగర్ Opposite సాయి వృద్ధాశ్రమము మారుచుండు సందర్భములో నా క్లయింట్ తాలూకా ఒరిజినల్ దస్తావేజులు ది. 25-3-2015, **దస్తావేజు నెం. 3276/2015** నెంబరు గలది తేది. 11-3-2023న జారి పడిపోయినది. సదరు దస్తావేజు ఎంత వెతికినను కనబడలేదు అని తెలిపినారు. సదరు ఒరిజినల్ దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాకు అందచేసి తగిన పారితోషికం పొందగలరు.

SIRIKI SRINIVASA RAO
Advocate
D.No. 2-12-12/2, A.C.Gardens
Rajamahendravaram
Cell: 9989362666